క్లుప్తంగా

టీటీయూసీ గ్రేటర్ జనరల్ సెక్రెటరీగా వంశీకృష్ణారెడ్డి



మలక్‌పేట: తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్ (టీటీయూసీ-బీఆర్ఎస్ అనుబంధ సంస్థ) గ్రేటర్ జనరల్ సెక్రెటరీగా మూసారంబాగ్‌కు చెందిన వంశీకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ, అసంఘటిత కార్మికులను ఏకం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

సత్కారం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నాయకులు

లింగోజిగూడ: సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శనివారం పాఠశాల ఆవరణలో రామోజీ వీరమ్మ బ్రహ్మచారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పురుషోత్తం మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తుందని, అందుకే ఉత్తమ ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, నాయకులు జంగయ్య యాదవ్, త్రివేది, నవీన్, అరుణ్, కౌశిక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీకి పప్పుల సుధాకర్ రాజీనామా

నాగోలు: ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ పప్పుల సుధాకర్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని శనివారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. రాజీనామా లేఖను రాష్ట్ర పార్టీ నాయకత్వానికి పంపించానన్నారు. పార్టీ కార్యక్రమాల వల్ల తాను సేవా కార్యక్రమాలకు పూర్తి సమయం కేటాయించలేకపోతున్నానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు.

చెక్కుల పంపిణీ

మన్సూరాబాద్: బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాలకు ప్రభుత్వం అందిస్తున్న చెక్కులను మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి దేవాదాయశాఖ అధికారులతో కలిసి ఆలయాల ప్రతినిధులకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు చేసిన పోరాట ఫలితంగానే దేవాదాయ శాఖ అధికారులు ప్రతి ఏడాది మాదిరిగానే ఇప్పుడు చెక్కులను ఆలయాల వద్ద పంపిణీ చేశారన్నారు.కార్యక్రమంలో వివిధ ఆలయాల కమిటీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం: సామ

మన్సూరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయడమే ఎజెండాగా పెట్టుకొని పాలన సాగిస్తోందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ధ్వజమెత్తారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని సీఎస్ఆర్ కాలనీ, ప్రియదర్శినీకాలనీ, విజయపురికాలనీ, ప్రగతినగర్, వీరభద్రకాలనీ, బృందావన్‌కాలనీలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి శనివారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను స్థానికులకు వివరిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం 70వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో ఎంతమందికి ఇళ్లు కేటాయించారో ప్రభుత్వం బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు.

శ్రీవైష్ణవ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడి మృతి



వెంకటాచారి (ఫైల్)

మన్సూరాబాద్: అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. వెంకటచార్యులు శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. మన్సూరాబాద్ హిమపురికాలనీలోని వెంకటాచారి నివాసానికి మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, కేబీఆర్ కన్వెన్షన్ ఎండీ కొప్పుల జనార్దన్‌రెడ్డి చేరుకుని మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఆటోనగర్‌లోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

బోనాలకు సర్వం సిద్ధం

- సర్వాంగ సుందరంగా ఆలయాల ముస్తాబు
- నేడు ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో బోనాలు



వేడుకలకు సిద్ధమైన పెద్దతోటలోని వాగామ్రి ఆలయం



విద్యుత్ దీపాల అలంకరణలో శ్రీపురం కాలనీలోని నల్ల పోచమ్మ ఆలయం



ఒక ఆలయంపై అమ్మవారి చిత్రాన్ని వేస్తున్న ప్రముఖ చిత్రకారుడు నాగార్జున రాము

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్/మలక్‌పేట జోన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు (ఆదివారం) బోనాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఇప్పటికే ఆలయాలను పూలు, మామిడి ఆకులు, వేప కొమ్మలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వంగా సుందరరంగా తీర్చిదిద్దారు. బోనాలు తీసుకొచ్చే మహిళలు, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగాకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మద్యం దుకాణాలను రెండు రోజులు (ఆదివారం, సోమవారం) బంద్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. భక్తులు అధికంగా పాల్గొనే ప్రధాన ఆలయాల వద్ద సిబ్బందిని పెద్ద సంఖ్యలో నియమిస్తున్నట్టు పోలీస్ ఉన్నత అధికారులు చెప్పారు.

ఐఎస్ సదన్, సైదాబాద్ ల్లో ...

సైదాబాద్: ఐఎస్ సదన్, సైదాబాద్ ల్లో ఆదివారం అమ్మవారికి బోనాల సమర్పణ, ఫలహారం బండ్ల ఊరేగింపు, సోమవారం శ్రద్ధాబాద్ మహంకాళి జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఘటాల ఊరేగింపునకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సైదాబాద్‌లోని మాతామైదాన్‌లోని విజయ దుర్గా మాత ఆలయం, జీవన్‌జ్యోతిలోని జయదుర్గా , సైదాబాద్ పెద్దతోటలోని వాగామ్రి మాత, మాతృశ్రీ కాలనీలోని రేణుకా ఎల్లమ్మ, విష్ణునగర్‌లోని నల్ల పోచమ్మ, నాగులమ్మ ఆలయాలను బోనాల ఉత్సవాల కోసం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

మలక్‌పేట: మూసారంబాగ్, సలీంనగర్, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలు ఆదివారం నిర్వహించే బోనాలకు ముస్తాబు చేశారు. శ్రీపురం కాలనీ నల్లపోచమ్మ ఆలయం, సాయినగర్ పోచమ్మ ఆలయానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. భక్తులకు అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు తగిన వసతులు కల్పించారు.



మన్సూరాబాద్‌లో కాటమయ్య బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఘనంగా కాటమయ్య బోనాలు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ గ్రామంలోని శ్రీకంఠమహేశ్వరస్వామి (కాటమయ్య) బోనాల ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి శ్రీధర్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, జగదీష్‌గౌడ్, నర్సింహ్మగౌడ్, బొంగు రఘుగౌడ్, రమేష్‌గౌడ్, రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



కాటమయ్య బోనాల్లో.. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



పాల్గొన్న బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్

రేపు పసుమాముల చౌడేశ్వరి ఆలయంలో జ్యోతి ఉత్సవాలు



సాక్షి, సిటీబ్యూరో: ఆషాఢ అమావాస్య సందర్భంగా సోమవారం పెద్ద అంబర్‌పేట మండలం పసుమాముల గ్రామం రోడ్డు చౌడేశ్వరి కాలనీలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సుగంధ అష్టమూలికా హరిద్ర, కుంకుమ, భస్మ, పంచామృత కనకాభిషేకాలు జరుపుతామని ఆలయ ట్రస్ట్ తెలిపింది. అనంతరం అలంకారం, చండీ హోమం, కుంకుమార్చనలు, చీర సారె, వడి బియ్యం, బోనం, గండ దీపం వంటి వివిధ కార్యక్రమాలతో పాటు సాయంకాలం జ్యోతి ఉత్సవాలు జరుపుతామన్నారు. సాయంత్రం నుంచి అమ్మవారి జ్యోతులు గుడి నుంచి బయలుదేరి పసుమాముల గ్రామంలో ఊరేగి తిరిగి ఆలయానికి చేరుకుంటాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ట్రస్ట్ కోరింది.

ఎస్‌సీటీపీను తనిఖీ చేసిన జీహెచ్ఎంసీ కమిషనర్



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్

ఎల్‌బీనగర్: నాగోల్‌లోని సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ పాయింట్ (ఎస్‌సీటీపీ)ను జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చెత్త తరలింపు విధానాన్ని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉప్పల్ చిలుకానగర్ వార్డు పరిసరాల్లో గార్బేజ్ వుల్నెరబుల్ పాయింట్స్‌ను తనిఖీ చేశారు. నాగోల్‌లో స్థానిక కాలనీవాసులు, శానిటరీ సిబ్బందితో మాట్లాడారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లను తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ ఆటోకు చెత్తను ఇవ్వాలని కాలనీవాసులకు సూచించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ఎస్.పంకజ, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రంజిత్, హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీ దివాకర్, ఉప్పల్ డీసీ అరుణకుమారి, అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ అధికారులు, డీఈ, ఈఎస్‌డబ్ల్యుఎంలు, రాంకీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఫలహారబండి ఊరేగింపు



ఫలహారబండి ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు

మన్సూరాబాద్: బోనాల ఉత్సవాల సందర్భంగా మన్సూరాబాద్‌లోని పోచమ్మదేవి అమ్మవారికి శ్రీసాయినగర్ కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయం నుంచి పట్టువస్త్రాల సమర్పణ, ఫలహారబండి ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో అర్ధరాత్రి వరకు ఆనందోత్సాహాలతో ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, రవి, మురళి, రమణమూర్తి, కృష్ణమూర్తి, రమేష్, కేశవులు, అర్చకులు బాల మురళీకృష్ణ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయాలని సీపీఐ ధర్నా

సైదాబాద్: విద్యాశాఖ నుంచి పూర్తిస్థాయిలో అనుమతులు తీసుకోకుండా నిర్వహిస్తున్న డీపీఎస్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఐఎస్ సదన్ డివిజన్ కార్యదర్శి, ఏఐవైఎఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్ డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా అక్రమంగా అడ్మిషన్లు తీసుకోవడాన్ని నిరసిస్తూ శనివారం ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని డీపీఎస్ పాఠశాల ముందు సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనుమతులు లేని పాఠశాలల్లో చదవటం వలన విద్యార్థులకు భవిష్యత్‌లో సమస్యలు ఏర్పడతాయన్నారు. అనుమతులు లేవని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ధర్నాకు స్థానిక కాలనీవాసులు సంఘీభావం తెలిపారు. కాలనీలో రాకపోకలకు పాఠశాల నిర్వాహకులు అడ్డంకులు సృష్టిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా చేస్తున్న నాయకులను సైదాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకొని అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ధర్నాలో సీపీఐ నాయకుడు శంకర్‌నాయక్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధర్మేంద్ర, ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ అధ్యక్షుడు చైతన్య యాదవ్, బాలకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఐఏసీజీ కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు, మలక్‌పేట ఫైర్ ఆఫీసర్ మహ్మద్ ముస్తాఫా తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్‌లోని నందిని కాంప్లెక్స్‌లోని 2వ అంతస్తులో కొంతకాలంగా ఐఏసీజీ కోచింగ్ సెంటర్ నడుస్తోంది. శనివారం ఉదయం 8.30కి కోచింగ్ సెంటర్ కిటికీ నుంచి పొగ వస్తుండగా స్థానికులు గమనించి ప్రిన్సిపాల్ సురేష్‌కు సమాచారం ఇచ్చారు. అతడు ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కోచింగ్ సెంటర్‌లోని ఆఫీసులో ఫర్నిచర్, కంప్యూటర్‌లు కాలిపోయాయి. క్యాష్ కౌంటర్‌లోని రూ.10 లక్షల నగదు మాత్రం అలాగే ఉంది. ఏసీలో షార్ట్ సర్క్యూట్ కావడం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు తెలిపారు. సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించడం వల్ల పెను ప్రమాదం తప్పింది.

వాంబే క్వార్టర్స్‌లోని సమస్యల పరిష్కారానికి చర్యలు

మలక్‌పేట: ఎమ్మెల్యే అహ్మద్ బలాల శనివారం మూసారంబాగ్ డివిజన్ శాలివాహననగర్ వాంబే క్వార్టర్స్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వాంబే క్వార్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మైలపాక రాంచందర్, చిట్టుపాక ప్రభాకర్‌లు క్వార్టర్స్‌లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కమ్యూనిటీ హాల్లోకి వర్షపు నీరు వస్తోందని, వాటర్ ట్యాంక్, వెనుక వైపు తలుపులు, కిటికీలు బిగించాలని, క్వార్టర్స్‌కు మరమ్మతులు చేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే బలాల వాంబే క్వార్టర్స్‌లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత తొందరగా సమస్యలను పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ ప్రదీప్, ఏఈ రవికాంత్, సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, క్వార్టర్స్ నివాసులు రాంచందర్, ప్రభాకర్, నర్సింహ, కుమార్, రమేష్, కృష్ణ, సైదులు, నాగయ్య, సుదర్శన్, అంజమ్మ, కాంతమ్మ, రాణి, పాల్గొన్నారు.

'కేర్'లో యువకుడికి అరుదైన శస్త్రచికిత్స



కోలుకున్న యువకుడిని చూపిస్తున్న కేర్ హాస్పిటల్ వైద్యులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట కేర్ హాస్పిటల్‌లో ఒక యువకుడికి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా చేశామని హాస్పిటల్ సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ కేవీ శివానందరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడుతూ, శరీరంలోని ఎడమవైపు భాగంలో తీవ్రమైన బలహీనతతో 25 ఏళ్ల యువకుడు ఇబ్బంది పడేవాడు. పలుచోట్ల వైద్యులను సంప్రదించినా ఫలితం కనిపించలేదు. దీంతో అతను కేర్ హాస్పిటల్ వైద్యులను సంప్రదించాడు. వైద్యపరీక్షల్లో అతడికి ప్రొలాప్స్ ఇంటర్ వెర్టబ్రల్ డిస్క్ (పీఐవీడీ) అనే అరుదైన రోగ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వైద్యులు అతడికి అరుదైన శస్త్రచికిత్స చేయడంతో కోలుకున్నాడు. అతడి అవయవాలు మళ్లీ పని చేయడం ప్రారంభించాయని డాక్టర్ శివానందరెడ్డి తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి సమర్థవంతమైన పరిష్కారాలు అందించడంలో మలక్‌పేట కేర్ హాస్పిటల్ నిబద్ధత మరోసారి వెల్లడైందని ఆయన పేర్కొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



విద్యార్థి నాయకులుగా ఎన్నికైన వారితో ఉపాధ్యాయులు

హయత్‌నగర్: విద్యార్థులు బావి నాయకులుగా ఎదగాలని, చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చు కోవాలని హయత్‌నగర్ మెగాసిటీ పాఠశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం విద్యార్థి నాయకుల ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటే భవిష్యత్ మంచి నాయకులుగా ఎదిగి సమాజానికి, దేశానికి సేవ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కెప్టెన్, అసిస్టెంట్ కెప్టెన్, సెక్రెటరీ, గ్రూప్ లీడర్లుగా ఎన్నికైన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ స్వాతి, ప్రిన్సిపల్ వాసు, వైస్ ప్రిన్సిపల్ స్వాతి పాల్గొన్నిరు.



విజ్ఞాన వర్ధిని పాఠశాలలో బోనాల వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



నాగార్జున స్కూల్‌లో.. పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్

పాఠశాలల్లో బోనాల సందడి

సైదాబాద్: మలక్‌పేట, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లోని పలు పాఠశాల్లో శనివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బాలికలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను తలపై ఎత్తుకోగా, బాలురు పోతురాజు వేషధారణలో చిందులేశారు. మరికొందరు బాలలు డప్పువాయిద్యాలతో అలరించారు. సైదాబాద్‌లోని విజ్ఞానవర్ధిని ఉన్నత పాఠశాలలో బోనాల వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ వీరేంద్రబాబు యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగార్జున హైస్కూల్‌లో...

నాగోలు: నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీలోని నాగార్జున హైస్కూల్‌లో బోనాల వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం: ఏసీపీ

హస్తినాపురం: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసలుతో సమానమని నేరాల నియంత్రణ కోసం ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని వనస్థలిపురం డివిజన్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి అన్నారు. శనివారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయశ్రీకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 9 సీసీ కెమెరాలను వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, ప్రతి కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కాలనీల్లో అద్దెకు వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకొని, ఆధార్‌కార్డులు తీసుకున్న తర్వాతే ఇళ్లను అద్దెకు ఇవ్వాలని సూచించారు. కాలనీలలో కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, డీఐ వెంకట్, ఎస్ఐలు మాధవరెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

జూదం ఆడుతున్న ఐదుగురి అరెస్టు

హస్తినాపురం: జూదం (నిషేధిత మూడు కాయిన్ల ఆట) ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఆటోనగర్‌లోని ఏఆర్‌సీ ట్రాన్స్ పోర్టు ఆవరణలో శనివారం గుట్టు చప్పుడు కాకుండా జూదం ఆడుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లారు. మూడు కాయిన్ల ఆట ఆడుతున్న ముదిగొండ శ్రీను(35), జగాల అశోక్ కుమార్(54), ఎం.రాంచందర్‌రావు(48), అంబుల ప్రదీప్ (40), తమ్మిశెట్టి ప్రకాశ్ (63)లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.51 వేల నగదు, 3 కాయిన్‌లు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

దిల్‌సుఖ్‌నగర్: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందని అనిబిసెంట్ మహిళా కళాశాలల చైర్మన్ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. శనివారం కొత్తపేటలోని అనిబిసెంట్ జూనియర్ మహిళా కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు కొత్తపేటలోని బాబూ జగ్జీవన్‌రాం భవనంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అనిబిసెంట్ మహిళా కళాశాలల చైర్మన్ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థినుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఇందిర, విద్యార్థులు పాల్గొన్నారు.

టెలీ లా అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకోండి

రంగారెడ్డి కోర్టులు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ఆవరణలో దిశ పథకం, టెలీ లా, ఉచిత న్యాయసేవలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఇందిర మాట్లాడుతూ, టెలీ లా మొబైల్ అప్లికేషన్‌ను సద్వినియోగం చేసుకొని ఉచిత న్యాయ సలహాలు పొందవచ్చన్నారు. టెలీలా ప్యానల్ న్యాయవాది బాదం జగదీశ్వర్ దిశ పథకం, టెలీలా అప్లికేషన్ గురించి వివరించారు. టెలీలా అప్లికేషన్ ద్వారా బాధితులు నేరుగా తమ పేరు నమోదు చేసుకుని, ప్యానల్ న్యాయవాదుల ద్వారా ఉచిత న్యాయసలహాలు పొందవచ్చన్నారు.